క్లుప్తంగా

వాలీబాల్ జాతీయ జట్టుకు వీరరాఘవమ్మ ఎంపిక



సూరేపల్లి(భట్టిప్రోలు): జాతీయ స్థాయి వాలీబాల్ జట్టుకు స్థానిక వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని యరగళ్ల వీరరాఘవమ్మ ఎంపికైంది. ఇటీవల రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో కర్నూలులోని మాంటిస్సోరీ ఎ - క్యాంపస్‌లో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. జాతీయ జట్టులో తమ విద్యార్థిని ఎంపికకావడమే కాక జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావులను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస శర్మ పాలకవర్గ అధ్యక్షులు వేమూరి చలమయ్య, కార్యదర్శి రావు రమణారావు అభినందించారు.

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవం



రేపల్లె రూరల్: కారుమూరు గ్రామంలో నిర్వహిస్తున్న చెన్నకేశవస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించనున్నారు. మహోత్సవాలు మంగళవారానికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు రామకృష్ణ, డాక్టర్ ఆదిత్యల ఆధ్వర్యంలో అర్చకులు వెంకటాచార్యులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా స్వామివారి విగ్రహాలకు సాయంత్రం గ్రామోత్సవం కార్యక్రమం చేశారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

రేపల్లె రూరల్: మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీగుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మంగళవారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు, వడ్లమూడి సాంబశివరావు, వీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేత్ర, శరీరదానం చేసిన కొత్తపల్లి సుధాబాల



తెనాలి: భౌతికంగా మరణించినా ఉదాత్తమైన ఆశయంతో కొందరు చిరంజీవులుగా ఉంటారు. ఇంకొకరి శరీరాల్లో జీవించే ఉంటారు...నవీన ఆవిష్కరణలకు దోహదపడే ప్రయోగాలకూ ఉపయోగపడతారు. పట్టణంలోని ఈటీ కాలనీకి చెందిన కొత్తపల్లి సుధాబాల (77)ఇందుకో నిదర్శనం. ఆమె భర్త కొత్తపల్లి రవిబాబు. జనసాహితి మాసపత్రికకు నాలుగు దశాబ్దాలుగా ప్రధాన సంపాదకుడుగా ఉన్నారు. రేపల్లె దగ్గర్లోని నగరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేసి రిటైరయ్యారు. రవిబాబు సాహిత్య ఉద్యమానికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చిన సుధాబాల, మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వగృహంలో మృతిచెందారు. కుటుంబసభ్యులు ఆమె అంతిమయాత్ర వంటి చివరి సంస్కారాలను తలపెట్టలేదు. గుంటూరులోని అగర్వాల్ కంటి ఆసుపత్రికి ఆమె నేత్రాలను దానం చేశారు. దన్వంతరి ఐ డొనేషన్ కేంద్రం సహకారంతో ఉదయాన్నే ఆమె కార్నియాను సేకరించుకువెళ్లారు. శరీరాన్ని వైద్యవిద్యార్థుల పరీక్షల కోసం అప్పగించగా, ఆ ప్రకారం విజయవాడ దగ్గర్లోని నిమ్రా వైద్య కళాశాల టెక్నీషియన్లు సాయంత్రం సుధాబాల భౌతికకాయాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాస్తిక సమాజం అధ్యక్షుడు, అమ్మ అవయవ, శరీరదాన సంఘం, తెనాలి కో-ఆర్డినేటర్ నందూరి నారాయణరావు సహకరించారు. జనసాహితి ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు దివికుమార్, ప్రజాసాహితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరుణ, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.సాంబశివరావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విద్యార్థిని బెదిరిస్తున్న యువకుడి అరెస్ట్

చేబ్రోలు: విద్యార్థిని ఫొటోను ఇన్‌స్ట్రాగామ్ ద్వారా సేకరించి అసభ్యకరంగా మార్ఫింగ్ ఫొటోతో డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్న యువకుడిని చేబ్రోలు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ జి.వెంకటాద్రి వివరాలను విలేకర్లకు వెల్లడించారు. విద్యార్థిని ఫొటోను సేకరించిన యువకుడు న్యూడ్ ఫొటోగా మార్ఫింగ్ చేసి ఇన్‌స్ట్రాగామ్‌లో విద్యార్థిని స్నేహితులకు షేర్ చేశాడు. తన స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం ఎస్‌ఐ వెంకటకృష్ణ, స్థానిక ఎస్‌ఐ వెంకటాద్రి కలిసి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలం నేలటూరు గ్రామానికి చెందిన వట్టికూటి మణిశ్రీరామ్ జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సైబర్ నేరాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటాద్రి సూచించారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున
- క్రాపలో గడప గడపకు మన ప్రభుత్వం



క్రాపలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. మండలంలోని క్రాపలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని అధికారులను ఆదేశించారు. క్రాప ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరడంతో ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, మరో నెలరోజుల వ్యవధిలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వివరించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలన్న కాంక్షతో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా ప్రజలలో ప్రభుత్వంపై ఏర్పడుతున్న ఆదరాభిమానాలను చూసి తట్టుకోలేని టీడీపీ కుట్రలు, కుతంత్రాలతో పేద వర్గాల అభ్యున్నతిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు, సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు పొలిమట్ల ఆనంద్, క్రాప ఉప సర్పంచి గొరికపూడి అంకమ్మరావు, వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ తూము నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, కమ్మెల సాంబయ్య, కూచిపూడి మోషే, బొల్లా వీరరాఘవయ్య, మేకతోటి ఏలియ్య, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమం



పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో 42వ మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శ్రీఘ్రముగా వివాహం కోసం ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మహా గౌరీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి పూజలు నిర్వహించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- పట్టణంలో శరవేగంగా అభివృద్ధి పనులు
- మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె: రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణాభివృద్ధి పనులు సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే ఓల్డ్‌టౌన్ ప్రధాన రహదారి విస్తరణ జరిగిందన్నారు. అదే విధంగా అరవపల్లి రహదారిలో ప్రధాన కాలువల నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని వివరించారు. ప్రతి ఒక్కరూ పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి అంతరాయం రాకుండా నిరంతరం పంపిణీ జరిగేలా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో పాలిథిన్‌ను నిషేధించటం జరిగిందని, పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ వాడకం వీడేలా ప్రజలకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం అజెండాలోని 21 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు సమాయత్తం కావాలి



పేటేరు గ్రామంలో చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రేపల్లె రూరల్: చిరుధాన్యాలు సాగు చేసేందుకు రైతులు సమాయత్తం కావాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు అన్నారు. చిరుధాన్యాల సంవత్సరం-2023 కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పేటేరులో చిరుధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సాములు, అరికలు, వరిగల మానవుని ఆరోగ్యానికి, వ్యాధినిరోధక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. వీటిలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఇనుపధాతువులు, కాల్షియం వంటినే అనేక పోషకపదార్థాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి రవికిరణ్, పంచాయతీ సెక్రటరీ పుష్పకుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు కొండలు, సుష్మా, నాగలక్ష్మి, ఏఈవో పావని, ఎంపీఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

బలిజేపల్లి(వేమూరు): చిరుధాన్యాలు సాగు లాభసాటిగా ఉంటుందని శాస్త్రవేత్త గంగాదేవ్ తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంపై సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మలత, డీఆర్‌సీ ఏఓ వి.ఉమామహేశ్వరి, వేమూరు ఏఓ సునీత, వీఏఏ లూధియా కుమారి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆర్డీఓ జె.పార్థసారథి



భోజనం పరిశీలిస్తున్న పార్థసారథి

రేపల్లె రూరల్: విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని, నాణ్యత ఏ మాత్రం లోపించినా సహించేది లేదని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల వసతి గృహంలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ వసతి గృహాలలో ఉంటూ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఎక్కువగా పేదవారే ఉంటారని, అటువంటి విద్యార్థినులకు మెరుగైన విద్యాబుద్ధులు అందించటంతో నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాన్ని అందించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజనం పథకంపై నిరంతరం నిఘాను ఏర్పాటు చేసి పరిశీలించటం జరుగుతుందని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు విజయేంద్ర, రాంబాబు, హెచ్‌ఎం వెంకట గిరికుమారి, వార్డెన్ మారుతీ, వీఆర్‌ఓ వెంకటప్పయ్య పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవాలి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తదితరులు

రేపల్లె: పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్క రూ తమ వంతు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని యాచకులకు మంగళవారం నిర్వహించిన దుప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు కిషోర్, కృష్ణమాచార్యులు, అయోధ్య బోసు, మృత్యుంజయరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

భట్టిప్రోలు: రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని భట్టిప్రోలు మండలం ఓలేరు(ఎస్సీ), ఆళ్లమూడి (ఓసీ)గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీఓ డి. మాణిక్యం మంగళవారం తెలిపారు. అభ్యర్థులు జనవరి ఒకటి 2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, లేని ఎడల 9వ తరగతి విద్యార్హతను పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారులు సంబంధిత ధృవ పత్రాల నకళ్లతో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5:30 గంటల లోపుగా రేపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని వివరించారు.

రేపల్లెలో..

రేపల్లె: ఐసీడీఎస్ రేపల్లె ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ, సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదల చేసినట్లు సీడీపీఓ మాణిక్యం మంగళవారం తెలిపారు. రేపల్లె పట్టణంలోని 14వ వార్డు(ఓసీ), మండలంలోని నల్లూరిపాలెం(ఓసీ ఓహెచ్), నల్లూరు(బీసీ-డీ), భట్టిప్రోలు మండలం ఓలేరు(ఎస్సీ), ఆళ్ళమూడి(ఓసీ) అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ, సహాయకుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల పరిధిలోని ఆయా కేటగిరీల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందించాలని కోరారు.

నిజాంపట్నంలో..

నిజాంపట్నం: పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్‌చార్జి సీడీపీఓ స్వరూపారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లపట్ల ప్రాజెక్ట్ పరిధిలో కార్యకర్త, ఆయా పోస్టుల వివరాలు నగరం మండలం అద్దంకివారిపాలెం కార్యకర్త(బీసీ-సీ), ఆయా పోస్టులు చెరుకుపల్లి మండలంలో గుళ్లపల్లి సాలిపేట(బీసీ-సీ), ఆళ్లవారిపాలెం-2(ఓసీ-ఓహెచ్), కనగాల యాదవపాలెం(బీసీ-సీ), తూర్పుపాలెంలో బడెవారిపాలెం(బీసీ-డీ), నగరం మండలంలో ఆయా పోస్టులు పెద్దవరం-బీసీ సెంటర్(బీసీ-డీ), తాడివాకవారిపాలెం-2(ఓసీ-ఓహెచ్), తాడివాకవారిపాలెం-1 (ఓసీ), పెదపల్లి గట్టువారిపాలెం(ఓసీ-ఈడబ్ల్యూఎస్), నిజాంపట్నం మండలంలో ఆయా పోస్టు బొర్రావారిపాలెం-1(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయం

చుండూరు(వేమూరు): జగనన్న కాలనీకి ప్రభుత్వం విద్యుత్ లైనులతో పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఎంపీపీ జాలాది రూబేను తెలిపారు. చుండూరు మండలంలోని అంబేడ్కర్ నగర్‌లోని జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి విజయకుమార్, విద్యుత్ శాఖ ఏఈ అర్జునరావు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు జెండా పండుగ



జెండాను విద్యుత్‌దీపాలతో అలంకరించి ఊరేగిస్తున్న యువత

రేపల్లె: జనవరి నెలను పురస్కరించుకని క్రీస్తును ఆరాధిస్తూ నిర్వహించే జెండా పండుగ మంగళవారం పట్టణంలోని 15, 16 వార్డుల యువత వేర్వేరుగా నిర్వహించారు. 16వ వార్డులోని లూథరన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగ వేడుకల్లో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త పాల్గొన్నారు. జెండా పండుగ వేడుకలకు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అందించిన రూ.20వేల ఆర్థిక సాయాన్ని నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక అలంకరించిన జెండాలను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- చెరువుజమ్ములపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



చెరువుజమ్ములపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కోన

బాపట్ల: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని చెరువుజమ్ములపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సాయాన్ని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు విడుదల చేశారని తెలిపారు. బాపట్ల పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు వంద ఎకరాల్లో రెండో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి రూ.18కోట్లు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినట్లు వివరించారు. జాతీయ రహదారి నుంచి మరుప్రోలువారి పాలెం, పాండురంగాపురంలో నుంచి కొత్త ఓడరేవు వరకు 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి ఒక వైపు, సంక్షేమం మరో వైపు రెండుకళ్ళులా పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి,కట్టికల యోహోషువా,ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు,మార్కెట్‌యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, నాయకులు వడ్డిముక్కల డేవిడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

చెరుకుపల్లి: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. మండలంలోని పొన్నపల్లి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఎస్పీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని కోరారు. క్రీడ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శివశంకర్, స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి, ప్రిన్సిపాల్ నర్గిస్ క్వాజీ పాల్గొన్నారు.

మత్స్యకారుల మధ్య చేపల వలల వివాదం



కృష్ణా నదిలో చేపల వలల విషయంలో ఘర్షణ పడుతున్న మత్స్యకారులను చెదరగొడుతున్న పోలీసులు

కొల్లూరు: చేపల వేటకు ఉపయోగించే వలల విషయంలో మత్స్యకారుల మధ్య మంగళవారం వివాదం చోటుచేసుకుంది. మండలంలోని గాజుల్లంక, పోతార్లంక గ్రామాలకు చెందిన మత్స్యకారుల కొన్నేళ్లగా వివాదం ఉంది. వివాదాన్ని పరిష్కరించేందుకు ఇటీవల పోలీసు, రెవెన్యూ, మత్స్యశాఖలు ఇరు పక్షాలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం నిషేధించిన వలలను వినియోగించరాదని ఆదేశించారు. అయితే గాజుల్లంకకు చెందిన మత్స్యకారులు ప్రభుత్వం నిషేధిచిన ఐరా వలను వినియోగించి చేపల వేట సాగిస్తున్నారంటూ పోతార్లంక గ్రామానికి చెందిన మత్స్యకారులు కృష్ణా నదిలో ఆందోళనకు దిగారు. మత్స్యకారుల నడుమ వివాదం సమాచారంతో కొల్లూరు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, కొల్లూరు, చుండూరు ఎస్‌ఐలు శామ్యూల్‌రాజీవ్‌కుమార్, నవీన్‌కుమార్ నదిలో చేపల వేట సాగిస్తున్న ప్రాంతానికి వెళ్లి గాజుల్లంక మత్స్యకారులను అడ్డుకున్నారు. ఈవిషయంపై గాజుల్లంకకు చెందిన మత్స్యకారులు తాము అధికారులు సూచించిన విధిగా నిషేధిత వలలను వినియోగించడం లేదని, పోతార్లంకకు చెందిన మత్స్యకారులు రేపల్లె మండలం పెనుమూడికి చెందిన వారిని తీసుకువచ్చి ఐరా వలలతో చట్ట విరుద్ధంగా చేపల వేట కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తాము నిషేధిత వలలు వాడకుండా నదిలో కాపలా ఉంచిన వ్యక్తులపై కూడా పోతార్లంకకు చెందిన వారు దాడులు చేసి తమపై నిందలు మోపుతున్నారని అధికారులకు దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం తాము చేపల వేటకు వినియోగిస్తున్న వల నిషేధించినది అయితే, పోతార్లంక మత్స్యకారులు చేపల కోసం నదిలో ఉంచిన వల సైతం ప్రభుత్వం నిషేధించినదేనని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇరు గ్రామాలకు చెందిన మత్స్యకారుల వాదనలు విన్న అధికారులు గాజుల్లంక సచివాలయ మత్స్యశాఖ ఎఫ్‌ఏ సూర్యని రెండు వలలను పరిశీలించి నివేదిక అందజేయాలని కోరారు. రెండు వలలు మత్స్యశాఖ నిషేధించినట్లు వెల్లడించారు. దీంతో వివాదాలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. మత్స్యకారులు నిబంధనలు అతిక్రమించి వివాదాలకు వెళితే చట్టపరమైన చర్యలు చేపట్టడంతోపాటు, కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

బీసీల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

ఎమ్మెల్యే కోన రఘుపతి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, అసోసియేషన్ నాయకులు

బాపట్ల అర్బన్: బీసీల సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. స్థానిక మేధా కాలేజ్ ప్రాంగణంలో యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(యాఫా) నూతన సంవత్సర క్యాలెండర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్ద పీట వేయడం, మంత్రి పదవులు ఇచ్చి ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. యాఫా అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన పదవులకు ప్రాధాన్యత కల్పించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రసాద్, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ నర్రా వెంకటరావు, సుబ్బయ్య, చెంచయ్య, అవుల వెంకటేశ్వరరావు, యాఫా వైస్ ప్రెసిడెంట్ బోయిన శ్రీనివాసరావు, యశ్వంత్ పాల్గొన్నారు.

బీసీ భవన నిర్మాణానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు ఎనుమల భాస్కర్‌గౌడ్

బాపట్ల: బీసీ భవన నిర్మాణానికి అందరు కలిసి రావాలని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు ఎనుమల భాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో యాదవపాలెంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో బీసీ సంఘం భవనం ఏర్పాటుకు అందరిని కలుపుకోని ముందుకుపోతామని చెప్పారు. ఎమ్మెల్యే కోన రఘుపతి చొరవతో సంఘానికి సంబంధించి స్థలసేకరణ, భవనం నిర్మాణానికి కృషి జరుగుతుందని తెలిపారు. సమావేశంలో బీసీ నాయకులు ఉప్పాల మురళి, అంకిపల్లి సాంబయ్య, నక్కల రాంబాబు, తాడిచెట్టి రామకోటేశ్వరరావు, దర్శి సింగయ్య ,నర్రా శివాజీ, తోట నాగేశ్వరావు, బోయిన వెంకట సుబ్బారావు,నర్రా శంకరరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.